క్లుప్తంగా

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌కు పూర్తి బాధ్యతల అప్పగింత



ప్రిన్సిపాల్ మంజులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా భీమునిపట్నం ఎస్‌వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ ఆర్. మంజులకు విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు అదనపు బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆమెకు విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఇతర అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది ఆమెను అభినందించారు.

క్రైస్తవుల శాంతియుత ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొన్న జ్ఞానాపురం క్యాథలిక్ క్రైస్తవ నాయకులు

కంచరపాలెం: ఏసుక్రీస్తు జనన, మరణ పునరుత్థానాన్ని చాటి చెప్పాలనే ఉద్దేశ్యంతో జీవీఎంసీ కార్యాలయం వద్ద విశాఖ ఆర్‌సీఎం ఆర్చి డయోసిస్, అలిండియా క్యాథలిక్ యూనియన్, ఆల్ చర్చెస్, ఫెలోషిప్స్, డినామినేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) అధ్యక్షుడు శ్రీముసురు రాజేష్ దీనికి నేతృత్వం వహించారు. జ్ఞానాపురం పునీత పేతురు దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ ర్యాలీని సెయింట్ పీటర్స్ చర్చి వద్ద ప్రారంభించారు. కార్యక్రమంలో బూర రవీంద్ర శేషుబాబు, బేథా జోసెఫ్, గోన స్వామినాథం తదితరులు పాల్గొన్నారు.

బాలికల కళాశాలలో కళావేదిక ప్రారంభం



బాలికను అభినందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వైశ్యరాజు జ్యూయలర్స్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)గా వైశ్యరాజు జ్యూయలర్స్ నిధులతో సౌత్ జైల్‌రోడ్డులో గల విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాలలో నిర్మించిన కళావేదిక, బాలికల హ్యాండ్ వాష్ బేసిన్లను శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వైశ్యరాజు జ్యూయలర్స్ వ్యవస్థాపక చైర్మన్ వైశ్యరాజు ఫాల్గుణరాజు, వైశ్యరాజు గిరి, నరేష్, కుటుంబ సభ్యులు కె. రూప, వానపల్లి ఫణికుమారి, నాగ శివంరెడ్డి, సరిపల్లి రమేష్, ఎం. శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను పతకాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఇంటర్ విద్య జిల్లా అధికారి బి. రాధ, కళాశాల ప్రిన్సిపాల్ జె. విజయ తదితరులు పాల్గొన్నారు.

తస్మాత్ జాగ్రత్త

ఎండలతో పొంచి ఉన్న వడదెబ్బ ప్రమాదం
జాగ్రత్తలతోనే నివారణ సాధ్యమంటున్న వైద్యులు
ద్రవపదార్థాలు అధికంగా తీసుకోవాలని సూచన





గొడుగు నీడలో పిల్లలతో వెళ్తున్న మహిళ



ఎండ తగలకుండా జాగ్రత్తలు పాటిస్తూ వెళ్తున్న యువతులు

సీతమ్మధార: భానుడి భగభగలకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్ల నుంచి బయటికి రావాలంటే భయపడి పనులు వాయిదా వేసుకుంటున్నారు. అత్యవసర సమయంలో రోడ్లపైకి వచ్చే వారు తప్పనిసరిగా గొడుగులు, తాగునీరు వెంట తీసుకెళ్లాలని వైద్యులు చెబుతున్నారు. ఉదయం 10లోపు సాయంత్రం 3 గంటల తర్వాత మాత్రమే బయటికి వెళ్లాలని సూచిస్తున్నారు. ఎండ తీవ్రత వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి (104.9) మెదడు మీద ప్రభావం చూపుతుంది. దీని వల్ల మెదడులోని ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్రం (హైపో థాలమస్) దెబ్బతిని వడదెబ్బకు గురి కావలసిన ఎదుస్థితి ఏర్పడుతుంది. దీనినే హీట్ స్ట్రోక్ లేదా సన్ స్ట్రోక్ (వడదెబ్బ) అంటారు. ఇది ప్రమాదకరం

వడ దెబ్బ బారిన పడిన వ్యక్తికి ప్రథమ చికిత్సలు..

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ గల ప్రదేశానికి తీసుకెళ్లాలి.
- చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితికి వచ్చే వరకు అలాగే చేస్తుండాలి. ఫ్యాన్ గాలి, చల్లని గాలి తగిలేలా ఉంచాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం తాగించాలి.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

వడదెబ్బ లక్షణాలు..

చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మత్తు నిద్ర లేదా కలవరింతలు, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితి, శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి కావడం, శరీరం ఉష్ణాన్ని కోల్పోవడం వంటివి. వడ దెబ్బకు ఎక్కువగా 65 సంవత్సరాలు పైబడిన వ్యక్తులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, పసిపిల్లలు, అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు గురవుతారు.

వడ దెబ్బ వల్ల శరీరంలో కలిగే మార్పులు..

వాతావరణ వేడిమికి శరీరం ఎక్కువ సేపు గురి కావడం వల్ల చెమట పట్టి శరీరంలోని లవణాలు (సోడియం క్లోరైడ్) తగ్గిపోవడం, శరీరంలో నీటి నిష్పత్తి తగ్గడం జరుగుతుంది. ఉష్ణోగ్రత ఉన్న ప్రదేశాల్లో ఎక్కువ శ్రమతో కూడిన పని చేస్తున్నప్పుడు ప్రతి గంటకు మూడు లేక నాలుగు లీటర్ల నీటిని చెమట రూపంలో మన శరీరం కోల్పోతుంది.

వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు..

- గొడుగు వాడటం, తెలుపురంగు, పలుచటి చేనేత వస్త్రాలను ధరించడం.
- తలకు టోపీ లేదా రుమాలు వాడడం.
- వేడిగాలులు తగలకుండా చూసుకోవడం.
- ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో ఆరు బయట అధిక శారీరక శ్రమతో కూడిన పని చేయకుండా ఉండడం.
- శీతల పానీయాలు, ఐస్ వాటర్ తీసుకుంటే గొంతుకు సంబంధించిన అనారోగ్యం ఏర్పడుతుంది.
- ఇంటి నుంచి బయటికి వెళ్లే ముందు ఒక గ్లాసు మంచినీరు తాగడం.

శరీరంలో నీరు తగ్గకుండా చూసుకోవాలి..



ప్రతి ఒక్కరు శరీరంలో నీరు తగ్గకుండా చూసుకోవాలి. దీర్ఘకాలిక ఆరోగ్య రుగ్మతలు ఉన్నవారు ఎండలో తిరడకూడదు. చిన్నపిల్లలు వడదెబ్బ తగలకుండా చూసుకోవాలి. కొబ్బరి బొండాలు, జ్యూసు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి.

– డాక్టర్ పి.వి.రమణమూర్తి, కళా హాస్పిటల్స్ అధినేత

నిరాశ్రయ వసతి గృహానికి వృద్ధుడి తరలింపు



షెల్టర్ హోంలో వృద్ధుడితో హెడ్ కానిస్టేబుల్ గోపీనాథ్, ప్రగడ వాసు

సీతమ్మధార: అల్లరి మూకల నుంచి ఒక వ్యక్తిని ఫోర్తుటౌన్ పోలీసులు రక్షించారు. సుమారు 70 సంవత్సరాల వయసు గల వృద్ధుడు రైల్వేస్టేషన్ ఫుట్‌పాత్ మీద ఉంటున్నాడు. కొంత మంది అయనను హింసిస్తున్న సమయంలో ఫోర్తుటౌన్ హెడ్ కానిస్టేబుల్ గోపీనాథ్ గమనించారు. అల్లరిమూకల్ని తరిమికొట్టి వృద్ధుడిని టీఎస్ఆర్ కాంప్లెక్స్ షెల్టర్‌కు తీసుకెళ్లారు. షెల్టర్ ఆ వృద్ధుడికి ఆశ్రయం కల్పించినట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. వృద్ధుడు తన ఊరు, పేరు తదితర వివరాలు ఏమీ తెలియజేయలేదని వాసు చెప్పారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిశారు



విద్యార్థులను అభినందిస్తున్న సంస్థ యాజమాన్యం

డాబాగార్డెన్స్: జేఈఈ మెయిన్స్‌లో ఆకాష్ విద్యార్థులు విజయం సాధించారు. విశాఖ నుంచి కొత్తపల్లి నిఖిల్ సాయి, గట్టు శ్రావణ్‌సాయి వరుసగా 99.59, 99.31 శాతం సాధించారు. ఆ సంస్థ వ్యాపార వ్యవహారాల అధికారి ధీరజ్‌కుమార్ మిశ్రా విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు మెడికల్, ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల్లో, ఎన్‌టీఎస్ఈ, ఒలింపియాడ్ వంటి పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి తగిన శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రీజినల్ సేల్స్ హెడ్ నిషాంత్ మిశ్రా, అసిస్టెంట్ డైరెక్టర్ వై. లక్ష్మీనారాయణ, బ్రాంచ్ హెడ్ రాజేష్, ఇతర ఫ్యాకల్టీ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

గౌతు లచ్చన్న స్మారక స్థూపం ఏర్పాటు చేయాలి



గౌతులచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తోట వాసుదేవరావు తదితరులు

డాబాగార్డెన్స్: విశాఖలో గౌతు లచ్చన్న స్మారక స్థూపం ఏర్పాటు చేయాలని విశాఖ జిల్లా శ్రీశయన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు డిమాండ్ చేశారు. గౌతులచ్చన్న 19వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జడ్జి కోర్టు సమీపాన గల గౌతు లచ్చన్న విగ్రహానికి ఆయనతో పాటు బంటుపల్లి కృష్ణారావు, యాగంటి రవి, మడ్డి ప్రసాదు, బొంగు రాజారావు, బెహర శోభన్‌బాబు, లొట్టి వెంకట రమణ, డొంకాన రమేష్ తదితర బీసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు లచ్చన్న చేసిన సేవలు ఎనలేనివన్నారు. బ్రిటీష్ వారిని ఎదురిస్తూ ఎన్నో సార్లు జైలు శిక్ష అనుభవిస్తూ, దేశం కోసం పోరాడిన వ్యక్తి సర్దార్ గౌతులచ్చన్న అని, ఆయన రాజకీయ జీవితం విశాఖ నుంచే ప్రారంభమైందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయించినప్పటికీ విశాఖపట్నం, విజయవాడ వంటి పట్టణాల్లో శ్రీశయన కులస్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వక పోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో బంటుపల్లి కృష్ణగిరి జోగారావు, తోట హరికృష్ణ, జలుమూరి చిట్టిబాబు, మడ్డి ప్రసాద్, దొంపక భాస్కరరావు, శ్రీశయన యువత తదితరులు పాల్గొన్నారు.

సుజాతారావుకు అభినందనలు



స్టాఫ్ నర్స్ సుజాతారావును అభినందిస్తున్న పద్మావతి తదితరులు

మహారాణిపేట: రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కేజీహెచ్ స్టాఫ్ నర్స్ ముసిడిపల్లి సుజాతారావు గోల్డ్ మెడల్ సాధించారు. దీంతో నర్సింగ్ సూపరింటెండెంట్, గ్రేడ్ వన్ పద్మావతి ఆమెను అభినందించారు. గ్రేడ్–2 కల్పనా మౌళి, హెడ్ నర్సులు పి.వరలక్ష్మి, నిర్మల జ్యోతి, కమల కుమారి తదితరులు నర్సింగ్ విభాగానికి మంచి పేరు తీసుకొచ్చిన సుజాతరావును కొనియాడారు.

నేడు ఈస్టర్ వేడుకలు



ప్రత్యేక ప్రార్థనలు జరగనున్న రక్షణ గిరి ముఖద్వార ప్రదేశం

కంచరపాలెం: క్రైస్తవులు ఉత్సాహంగా జరుపుకునే పాస్కా (ఈస్టర్) వేడుకలు ఆదివారం జరగనున్నాయి. మృత్యుంజయుడైన క్రీస్తును స్తుతించే ప్రార్థనలనే పాస్కాగా పిలుస్తారు. గుడ్‌ఫ్రైడే మరుసటి రోజు రాత్రి 12 గంటల తర్వాత ఏసుక్రీస్తు సమాధి నుంచి బయటికి వస్తారని క్రైస్తవులు విశ్వసిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం రక్షణ గిరిలో శనివారం రాత్రి నుంచి జాగరణ, దివ్య పూజా బలులు, ప్రార్థనలు నిర్వహించారు. లోకరక్షకుడు క్రీస్తును జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయానికి తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడ దివ్యపూజా బలులు సమర్పిస్తామని సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయ చర్చి విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు. పారిస్ పాస్టిల్ కౌన్సిల్ సభ్యులు ఉత్సవానికి నేతృత్వం వహిస్తారని ఆయన తెలిపారు.

స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్రతో పరిసరాలు పరిశుభ్రం



ర్యాలీలో పాల్గొన్న ఎంజీఎం పాఠశాల హెచ్‌ఎం నాగభూషణం, విద్యార్థులు తదితరులు



ర్యాలీలో పాల్గొన్న జెడ్సీ శివప్రసాద్ తదితరులు



ఈ-వ్యర్థాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

అల్లిపురం: మూడవ శనివారాన్ని పురస్కరించుకుని అల్లిపురం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారి పీవీఎన్ రాజు, మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీవీఎస్ నాగభూషణం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ 33వ వార్డులోని నీలమ్మ వేపచెట్టు, బంగారుమెట్ట ప్రాంతాల గుండా అల్లిపురం శాఖా గ్రంథాలయానికి చేరుకుంది. అక్కడ పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది గ్రంథాలయాన్ని శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఉద్యోగులు ఆర్.శివప్రభాకర్, జయ, పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో..

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ప్రోగ్రామ్ అధికారులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రతినెలా మూడవ శనివారం పరిసరాల పరిశుభ్రతకు సమయం కేటాయించి, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు సహకరించాలని అన్నారు. ఇ-వేస్టేజ్, తమ తమ టేబుళ్లు, కంప్యూటర్లు, రికార్డులు, విండో డోర్లు, పనికిరాని వస్తువులను విభజించి వాటిని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు పంపించే ఏరాట్లు చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ప్రోగ్రాం అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తమ సెక్షన్లు, పరిసరాలను పరిశుభ్రం చేశారు.

కేజీహెచ్‌లో..

శనివారం కేజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పరిసరాల శుభ్రత, ఈ-వ్యర్థాలు, పనికిరాని ఎయిర్ కండిషనర్ల పరికరాలు, బ్యాటరీల వంటి సామగ్రిని భూమిలో కప్పేశారు. అనంతరం ఉద్యోగులు, నర్సులతో ప్రతిజ్ఞ చేయించారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ డి.రాధాకృష్ణన్, డాక్టర్ జి.వాసవీలత, డాక్టర్ వి.రవి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ జి.మెహర్ కుమార్, అడ్మినిస్ట్రేటర్ బి. వి. రమణ, స్వచ్ఛ ఆంధ్ర నోడల్ అధికారి డాక్టర్ ఎ.రాజేష్, నర్సింగ్ సూపరింటెండెంట్లు సీహెచ్ పద్మావతి. ఎస్.కల్పనా మౌళి, మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏలో..

సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పలు విభాగాల్లో గల పరికరాలను వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ పరిశీలించారు. పనిచేయని కంప్యూటర్లు, కీబోర్డులు తదితర ఈ-వేస్ట్ ఉంటే ఐటీ వర్గాలకు అందించాలని సూచించారు. పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వొద్దు



జోన్-5 జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

- జోన్-5లో పారిశుధ్య కార్మికుల ధర్నా



జోనల్ కమిషనర్ రాముకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

కంచరపాలెం: మున్సిపల్ కార్మికుల్ని, పారిశుధ్య బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వొద్దని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ జోన్-5 జ్ఞానాపురం జోనల్ కార్యాలయం వద్ద శనివారం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు టి.నూకరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వాలని నిర్ణయించడం పట్ల కార్మికులందరూ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రైవేటు ఏజెన్సీల దగ్గర కూటమి ప్రభుత్వ నేతలు వేల కోట్లు కమీషన్లుగా తీసుకున్నారని, అందుకే మున్సిపల్ కార్మికుల బతుకులను కాంట్రాక్టర్లకు అప్పజెప్పేందుకు చూస్తున్నారని ఆరోపించారు. 20 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వం అయితే మున్సిపల్ కార్మికులను ప్రైవేటుపరం చేసే ప్రయత్నం చేసిందో ఆ ప్రభుత్వాల సంగతి తేలేదాకా కార్మికులు నిద్రపోలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వానికి కూడా అదే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కార్మికులు, రాష్ట్ర ప్రజల కన్నా ప్రైవేటు పెట్టుబడిదారులే చంద్రబాబు ప్రభుత్వానికి ఎక్కువైపోయారని అన్నారు. ఆప్కాసులో ఉన్న పొరపాట్లని సరిచేసి ఎంత మెరుగైన వ్యవస్థను తీసుకొచ్చినా ఫర్వాలేదని, లేదంటే ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ ప్రైవేటీకరణ విధానాలను బద్దలుకొట్టే వరకూ ఈ పోరాటాన్ని కొనసాగించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం జోనల్ కమిషనర్ బి.రాముని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జోన్ కార్యదర్శి ఒమ్మి అప్పారావు, నాయకులు ఎస్. శ్రావణ్‌కుమార్, వి.మహేశ్వరి, సీతాలక్ష్మి, అప్పలరాజు, పి.రాజు, ఎం.సత్యవతి, బాలరాజు, శివమణి, ధనలక్ష్మి, నూకరాజు, కొండమ్మ, కనకరాజు, సత్యవతి, కన్నతల్లి, కేధారి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న సీపీ బాగ్చి. చిత్రంలో డాక్టర్ సీతా మాణిక్యం

మహారాణిపేట: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చి అన్నారు. శనివారం ఆంధ్రా విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ లా కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మహిళలపై జరిగే సైబర్ నేరాలపై ప్రసంగించారు. సైబర్ నేరాలు జరుగుతున్న విధానం, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలిపారు. డాక్టర్ అంబేద్కర్ లా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సీతామాణిక్యం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.రాఘవయ్య, ప్రొఫెసర్ వి.రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ ఎ.పద్మావతి, ప్రొఫెసర్ ఎస్.బి. చంద్రకళ, డాక్టర్ కె.పల్లవి, న్యాయ, సిట్ విభాగాల నుంచి అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి ఆలయ అర్చకుడు శేషాచార్యులు అభిషేకాలు చేశారు.

50 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: జీవీఎంసీకి దీర్ఘ కాలంగా బకాయిలు ఉన్న వారికి 50 శాతం రాయితీ కల్పిస్తూ వన్‌టైం సెటిల్‌మెంట్ చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని జోన్-4 జెడ్సీ మల్లయ్య నాయుడు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వడ్డీలో 5 శాతం రాయితీ కల్పిస్తూ పన్ను చెల్లించుకోవడానికి వెసులు బాటు కల్పించారన్నారు. ఈ ఏడాది ఎప్పుడూ లేని విధంగా పెద్ద మొత్తం బకాయి ఉన్న వారికి 50 శాతం రాయితీ సెటిల్‌మెంట్‌కు అవకాశం కల్పిస్తున్నారని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్సీ కోరారు.

ఇక్కడ.. వాడేసిన చెప్పులూ విక్రయించబడును!



సెకండ్ హ్యాండ్ సామాన్ల విక్రయానికి బోలెడు క్రేజ్ ఉంది. ఒకప్పుడు వెహికల్స్, ఎలక్ట్రానిక్స్ మాత్రమే సెకండ్ హ్యాండ్‌గా అమ్మేవారు. ఇప్పుడు ప్రతి వస్తువూ సెకండ్స్‌లో దొరికేస్తోంది. ఈ వ్యక్తి ఇంకో అడుగు ముందుకేసి.. పోలీస్ బ్యారెక్స్ సమీపంలో ఇలా సెకండ్ హ్యాండ్ చెప్పులు విక్రయిస్తున్నాడు.

– ఫొటో సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం